సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో శ్రావణ మాసం ఆఖరి గురువారం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ ఆధ్వర్యంలో సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులందరితో లలితా సహస్ర నామాలు, సాయి సచ్చరిత పారాయణం చేయించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సాయినాథుడికి పూజలు జరిపారు.

మరో నిందితుడి అరెస్ట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద మొల్లి సంతోష్‌కుమార్‌పై జరిగిన దాడి కేసులో మరో నిందితుడిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 25న జరిగిన ఈ సంఘటనలో కొంత మంది సంతోష్‌కుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ దాడిలో పాల్గొన్న వారిలో 13 మందిని ఇప్పటికే అదుపులో తీసుకుని కోర్టులో హాజరు పర్చారు. గురువారం ఈ కేసులో ఏ7 మొల్లి శ్రీనును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని కోర్టులో హాజరు పర్చినట్టు స్టీల్ ప్లాంట్ పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఏ8 వాసు పరారులో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో క్యాంటీన్లు అందుబాటులో ఉంచాలి

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల సౌకర్యార్థం క్యాంటీన్లు నిరంతరం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు గురువారం సీజీఎం (వర్క్స్) ఆర్.మహంతికి లేఖ అందజేశారు. ఫ్యాక్టరీ చట్టం ప్రకారం పరిశ్రమలో ఉద్యోగులకు తేనీరు, ఫలహారం, భోజనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఇందుకు ముందు ఉద్యోగుల పని ప్రదేశాలకు ఉక్కు క్యాంటీన్లు టీ, టిఫిన్లు అందించేవని, వాటిని ఇటీవల తొలగించారని చెప్పారు. అందువల్ల ఉద్యోగులు ప్రైవేటు క్యాంటీన్లపై ఆధారపడ్డారన్నారు. ఇప్పుడు ప్రైవేటు క్యాంటీన్లు కూడా తీసేస్తే ఉద్యోగులు ఇబ్బందులు పడతారన్నారు. కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకతలను దృష్టిలో ఉంచుకుని ఉక్కు క్యాంటీన్లను అందుబాటులో ఉంచాలని యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ కోరారు.

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

రణస్థలం: లావేరు మండలం బుడుమూరు కూడలి సమీపంలో గురువారం తెల్లవారుజామున రోడ్డు పక్కన నడుస్తున్న బొడ్డ గోవిందరాజులు(66)ను శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం విశాఖ జిల్లా గాజువాక మండలం బక్కన్నపాలెం. బుడుమూరులోని కుమార్తె ఇంటికి పది రోజుల కిందట వచ్చాడు. ఉదయం బహిర్భూమికి వెళ్లి రోడ్డు పక్కన నడుస్తుండగా.. ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు ఏఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనవడికి వృద్ధురాలి అప్పగింత

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ చేపట్టిన జ్యోతిర్గమయ కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. నగరంలో యాచకులుగా తిరుగుతున్న వారిని రెస్క్యూ చేయటంతో వారి మూలాలు బయట పడుతున్నాయి. వన్ టౌన్ ప్రాంతంలో జామి లక్ష్మి అనే వృద్ధురాలి పాదానికి ఇన్‌ఫెక్షన్ అయ్యి వర్షంలో తడుస్తుండగా సీపీ శంఖబ్రత బాగ్చి గుర్తించారు. ఆమెను వన్ టౌన్ పోలీసుల సాయంతో మాతృప్రేమ వృద్ధాశ్రమానికి పంపించారు. ఆశ్రమ నిర్వాహకురాలు మమత ఆమెకు సపర్యలు చేసి, ఆశ్రయమిచ్చారు. వివరాలు ఆరా తీసి.. విజయనగరం జిల్లా నరవలో ఉంటున్న ఆమె మనవడు రాయి మోహన్‌ను ఆశ్రమానికి పిలిపించారు. కంచరపాలెం పోలీసుల సమక్షంలో లక్ష్మమ్మను మనవడికి గురువారం అప్పగించారు.



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని దొంగతనం జరిగిన క్వార్టర్‌లో పరిశీలిస్తున్న పోలీస్



బాధితులను విచారిస్తున్న క్రైం పోలీసులు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో చోరీల బెడద
- ఒకే రోజు 6 క్వార్టర్లలో దొంగతనం
- చైన్ స్నాచింగ్‌లతో మహిళల బెంబేలు
- రెచ్చిపోతున్న దొంగలు.. హడలిపోతున్న నివాసులు



ఊడగొట్టిన తలుపు గడియ



పోలీసుల రికవరీలో లభ్యమైన బంగారు నగలు



దొంగలు విరగ్గొట్టిన బీరువా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్.. అదొక నగర శివారు ప్రాంతం.. పచ్చని చెట్ల మధ్య జనసంచారం లేని రహదారులు. అక్కడక్కడ విసిరేసినట్టు క్వార్టర్లు... కొత్త వారు ఎవరొచ్చినా పట్టించుకోని జనం.. చోరులకు ఇంతకంటే మంచి ప్రదేశం ఏముంటుంది. అందుకే దొంగలు, దోపిడీదారులు టౌన్‌షిప్‌ను టార్గెట్‌గా చేసుకుని చైన్ స్నాచింగ్‌లు, బెదిరించి దోపిడీలకు దిగడం, తలుపులు విరగ్గొట్టి ఇంట్లో దొంగతనాలకు పాల్పడటం వంటి సంఘటనలకు పాల్పడుతున్నారు. మహిళలు ఒంటరిగా వాకింగ్, షాపింగ్‌కు వెళ్తే.. నంబర్ ప్లేట్ లేని బైక్‌లపై రావడం, వారి మెడలోని వస్తువులను లాక్కెళ్లడం జరుగుతోంది. ఇటీవల ఇంటి బయట వాకింగ్ చేస్తున్న మహిళ మెడ నుంచి గొలుసు లాక్కెళ్లగా.. మరో మహిళ మెడలో వస్తువులేమీ లేకపోవడంతో ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించి పారిపోయారు. దీంతో మహిళలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లడానికి భయపడిపోతున్నారు.

ఎన్నో ఘటనలు..

స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సమీపంలో ర్యాపిడో డ్రైవర్‌ను, కూర్మన్నపాలెం ఆర్చ్ సమీపంలో ఫార్మా ఉద్యోగిని కొంత మంది బెదిరించి డబ్బులు లాక్కెళ్లడం వంటి కేసులు అనేకం. ఇక క్వార్టర్ల డోర్ బ్రేకింగ్ సంఘటనలు ఎన్నో. క్వార్టర్లలో ఉండే నివాసులు తాళాలు వేసి బయటకు వెళ్తే ఆ రాత్రి డోర్ బ్రేకింగే. దీంతో క్వార్టర్లలో నివసించే వారు ఊర్లెళ్లడానికి హడలి పోతున్నారు. కంపెనీ క్వార్టర్లు కావడంతో అత్యల్పమైన అల్యూమినియం ఆల్‌డ్రాప్‌లు మాత్రమే ఉంటాయి. దొంగలు పగలు ఏ క్వార్టర్ బయట తాళం వేసి ఉందో గమనించడం.. రాత్రి ఈజీగా ఆల్‌డ్రాప్ చేసి లోపలికి వెళ్లడం, అక్కడ గోద్రేజ్ బీరువా అయినా దానిని విరగ్గొట్టి అందులో ఉన్న నగదు, బంగారం సులభంగా దొంగిలించి పరారవుతున్నారు.

కేసుల ఛేదనలో పోలీసులు

దొంగతనాలు, చైన్ స్నాచింగ్, దోపిడీలపై క్రైం పోలీసులు పనితీరు సంతృప్తికరమని చెప్పవచ్చు. ఎటువంటి ప్రత్యేక నిఘా లేనప్పటికి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో దొంగలను పట్టుకోవడం, రికవరీ చేయడంలో తమ వంతు కృషి చేస్తున్నారు. ఇటీవల మహిళ మెడ నుంచి గొలుసు దొంగిలించిన వ్యక్తిని మూడు రోజుల్లో, 24 తులాల బంగారం దొంగతనం కేసులో 24 గంటల్లో నిందితులను అదుపులో తీసుకుని తమ ప్రావీణ్యతను చాటారు. ఇంట్లో వస్తువు కోల్పోవడం, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగడం, వాటి రికవరీ కోసం కోర్టులను ఆశ్రయించడం వంటి సమస్యలు బాధితులకు తప్పడం లేదు. దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు కరపత్రాలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నప్పటికి ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. నగలతో వాకింగ్‌కు వెళ్లటం, ఇంట్లో విలువైన వస్తువులు ఉండగా బయట ఊర్లకు వెళ్లడం వంటి కారణాల వల్లే దొంగతనాలు కొనసాగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు.

నిఘా లేకపోవడంతో దొంగల హల్‌చల్

ఇటీవల టౌన్‌షిప్ సెక్టార్–6లో యజమాని లేని గంట వ్యవధిలో పట్టపగలు క్వార్టర్‌లోకి ప్రవేశించి 24 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఒకే రాత్రి సెక్టార్–6లోని ఆరు క్వార్టర్లలో దొంగలు తెగబడి దోచుకున్నారంటే పరిస్థితి అర్థమవుతోంది. గతంలో రాత్రి వేళ హోంగార్డుల గస్తీ నిరంతరం ఉండేది. ఊరెళ్లే ముందు వారు హోంగార్డులకు సమాచారం అందిస్తే క్వార్టర్‌పై నిఘా పెట్టేవారు. తద్వారా నేరాలు గణనీయంగా తగ్గేవి. ఇటీవల సిబ్బంది నియంత్రణలో భాగంగా వారిని తగ్గించడంతో ఆ విధులను పూర్తిగా నిలిపివేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



దొంగతనాల నియంత్రణకు ప్రజలు అప్రమత్తంగా ఉండటం అవసరం. జనావాసాలు ఉన్న ప్రాంతాల్లో వాకింగ్ చేయాలి. నగలతో వెళ్లాల్సిన పరిస్థితుల్లో వాటిపై చీర కొంగు కప్పుకోవడం చేయాలి. బంగారం వంటి విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచు కోవడం అవసరం. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి.

– కె. శ్రీనివాసరావు, సీఐ, సౌత్ డివిజన్ క్రైం

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెదగంట్యాడ: మదీనాబాగ్ 11 కేవీ ఫీడర్, పాలవలస 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 22న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మదీనాబాగ్ ఫీడర్ పరిధిలోని మదీనాబాగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం బిల్డింగ్స్, పాలవలస ఫీడర్ పరిధిలోని మద్దివానిపాలెం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, దేవాడ, అప్పికొండ, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్, మురుభాయ్, పాలవలస, గొల్లపేట, ఈసరపువానిపాలెం, యలమంచిలిదొడ్డి, గిన్నిపాలెం, నక్కదొడ్డి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గాజువాక సబ్ స్టేషన్ పరిధిలో..

గాజువాక: గాజువాక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పంతులుగారి మేడ, రాజీవ్‌మార్గ్, భానోజీతోట ఫీడర్లకు శుక్రవారం మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్టు జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పంతులుగారి మేడ ఏరియా, జోగవానిపాలెం, పాతగాజువాక, నీల్ కమల్ వీధి, భానోజీతోట, సత్తెమ్మతల్లి గుడి, సంజీవగిరి కాలనీ, డిఫెన్స్ కాలనీ, బీసీ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రహదారిపై స్క్రాప్ దుకాణంతో ఇబ్బందులు



సిద్ధార్థనగర్ ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న స్క్రాప్ దుకాణం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థనగర్ ప్రధాన రహదారిపై స్క్రాప్ దుకాణం ఏర్పాటు చేసి రాత్రి పగలూ అనే తేడా లేకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు. కాగితాలు ఏరుకునే వారు, ఇనుప ముక్కలు తెచ్చేవారు అక్కడే తిష్ట వేస్తుండటం వల్ల చీకటి పడితే మహిళలు అటుగా వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. చెత్తాచెదారం, ఇనుప రేకులు, ముక్కలు అక్కడే వేయడం వల్ల చీకట్లో అవి తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. సమీపంలోనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉందని, అలాంటి దగ్గర స్క్రాప్ దుకాణం నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విశాలమైన రహదారిలో నిత్యం అటు ఉద్యోగులు.. ఇటు ఆటోనగర్‌లో పనిచేసే కార్మికులు తిరుగుతుంటారని చెబుతున్నారు. అటువంటి రహదారిని ఆక్రమించి దుకాణాలు పెట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై స్క్రాప్ దుకాణాన్ని వెంటనే తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నారాయణమూర్తికి ఘన నివాళి



నారాయణమూర్తి సంతాప సభలో మాట్లాడుతున్న తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: సహన శీలి, మృదు స్వభావి, నిరాడంబరుడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రంభ నారాయణమూర్తి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన అకాల మరణం బాధాకరమని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. వుడా కాలనీ జేఏసీ చైర్మన్ రంభ నారాయణమూర్తి సంతాప సభను ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులు గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నారాయణమూర్తి పార్టీలో ఉన్నారన్నారు. 76వ వార్డు అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు. నడుపూరులో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఇంటక్ జాతీయ నాయకుడు మంత్రి రాజశేఖర్, వార్డు అధ్యక్షులు మంత్రి శంకరనారాయణ, చావాడ శివ, నాయకులు రాజాన వెంకటరావు, పల్లా చినతల్లి, నక్క లక్ష్మణరావు, హ్మారెడ్డి, చిరంజీవి తదితరులు నివాళులర్పించారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని ధర్నా



సిద్ధార్థనగర్ వాటర్ ప్లాంట్ వద్ద ధర్నా చేస్తున్న 87వ వార్డు ప్రజలు

కూర్మన్నపాలెం: మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ 87వ వార్డు ప్రజలు గురువారం ధర్నా నిర్వహించారు. వార్డులోని సిద్ధార్థనగర్ 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో టీడీపీ నాయకులు పాల్గొనడం గమనార్హం. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించే సమయానికి కేవలం రెండు వార్డుల్లో 25 వేల జనాభా మాత్రమే ఉండేదని, ప్రస్తుతం 65 వేలకు సంఖ్య చేరిందని తెలిపారు. ఆటోనగర్‌లోని పరిశ్రమలకు కూడా సిద్ధార్థనగర్ ప్లాంట్ నుంచే మోటార్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారన్నారు. దీని వల్ల స్థానిక ప్రజలకు తాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. 86, 87 వార్డుల్లోని ప్రజలు స్లేటుల్లో నీళ్లు పట్టి బిందెల్లో వేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. మరో 12 ఎంఎల్‌డీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించాలని, ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు 70 హెచ్‌పీ మోటార్లు అమర్చి నీరు అందించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బి.రాజన్‌రాజు, వి.నారాయణమూర్తి, డి.వి.అప్పారావు, దాలయ్య, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ స్ట్రక్చర్ రూపకల్పనలో నానో టెక్నాలజీ



మాట్లాడుతున్న ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ సురేష్‌కుమార్

మురళీనగర్: కార్బన్ నానోట్యూబ్స్, ఫైబర్ నానో కంపోజిట్స్ వంటి ఆధునిక పదార్థాల వాడకం స్మార్ట్ స్ట్రక్చర్స్ రూపకల్పనలో కీలకమని రాయపూర్ ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)లో గురువారం ఆయన పాల్గొని 'స్మార్ట్ స్ట్రక్చర్స్–ఏ డిజైన్ థింకింగ్ పర్‌స్పెక్టివ్' అనే అంశంపై ప్రసంగించారు. నానో టెక్నాలజీ వల్ల ఉత్పత్తుల పనితీరు, దీర్ఘాయువు, విశ్వసనీయత గణనీయంగా పెరుగుతాయన్నారు. స్మార్ట్ మెటీరియల్స్, సెన్సార్లు ఆధునిక నిర్మాణ పద్ధతుల రూపకల్పనలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయని వివరించారు. డిజైన్ థింకింగ్ ద్వారా ఏరోస్పేస్, సివిల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ రంగాల్లో వినూత్న పరిష్కారాలను కనుగొనవచ్చని పేర్కొన్నారు.

డిజైన్ థింకింగ్ ఆధారంగా బోధన

టీసీఎస్ ఫార్మర్ స్ట్రాటజిక్ అడ్వైజర్ డాక్టర్ మోహన్ కంచర్ల 'రీ ఇమాజిన్ టీచింగ్ టు రీఇగ్నైట్ లెర్నింగ్' అనే అంశంపై ప్రసంగించారు. బోధనాభ్యసనలో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. డిజిటల్ లెర్నింగ్, ఇంటరాక్టివ్ పద్ధతులు, డిజైన్ థింకింగ్ ఆధారంగా బోధనను పునర్నిర్మిస్తే విద్యార్థుల ఆసక్తి పెరిగి, స్వయంగా నేర్చుకునేందుకు ఉత్సాహం చూపుతారన్నారు. ఇంజినీరింగ్ విద్యలో ఫ్యాకల్టీ సభ్యులు కొత్త బోధనా పద్ధతులు అవలంబించడం ద్వారా పరిశ్రమ అవసరాలకు సరిపోయే ప్రతిభను విద్యార్థుల్లో పెంపొందించవచ్చన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్, కో–కో ఆర్డినేటర్‌లు డాక్టర్ సిహెచ్.రాజు, ఎం.భరణి పాల్గొన్నారు.

జూ పార్కుకు ఐవోబీ వితరణ

ఆరిలోవ: ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్)లో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కుకు సహకారం అందించింది. ఇందులో భాగంగా సందర్శకుల సౌలభ్యం కోసం జూలో 25 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసింది. వీటిని గురువారం ఐవోబీ రీజినల్ మేనేజర్ రవికుమార్ గుప్తా, జూ క్యూరేటర్ జి.మంగమ్మ ప్రారంభించారు. ఈ బెంచీలను జూలో పలుచోట్ల సందర్శకులకు వీలుగా ఉండేలా ఏర్పాటు చేశారు. జూ క్యూరేటర్ ఐవోబీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఐవోబీ చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, పలు బ్రాంచ్‌ల అధికారులు సుష్మా, కె.మురళి, పి.శ్రీనివాసరావు, జూ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.ఉమాదేవి, అసిస్టెంట్ క్యూరేటర్ బి.గోపి, సీనియర్ అకౌంటెంట్ కె.సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



స్టీల్‌ప్లాంట్ రామలింగేశ్వర ఆలయంలో అలంకరణలో మహాశివుడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీప పర్వత వర్ధని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామున మహాశివుడికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ఉద్యోగులందరూ బాగుండాలని పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహాలకు పూజలు చేశారు. అనంతరం ఉక్కు ఉద్యోగి వీర అర్జునరావు, కమల కుమారి దంపతుల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పెదమడకలో అన్నసమారాధన నిర్వహిస్తున్న శివాలయ కమిటీ సభ్యులు

విశేష పూజలు, అన్నసమారాధన

అగనంపూడి: మాస శివరాత్రి సందర్భంగా 85వ వార్డు పెదమడకలోని శివాలయంలో ఘనంగా రుద్రాభిషేకం, విశేష పూజలు జరిపించారు. తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయంలో పూజలు చేశారు. పరమశివుడిని విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం దాతలు కిరణ్‌కుమార్, సంతోష్‌కుమార్‌ల సహకారంతో విశేష అన్నసమారాధాన చేపట్టారు. దాతల కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.



పెదమడక ఆలయంలో పూజలందుకున్న మహాశివుడు